
సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

## హామీలపై నిలదీద్దాం

- కష్టపడి పని చేద్దాం.. మరోసారి గులాబీ జెండా ఎగరేద్దాం
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపు
- శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా

హుజూరాబాద్ టౌన్, మార్చి 5: కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజల గొంతుకలం అవుదామని, హామీల అమలుపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీద్దామని, ఆ పార్టీ వైఫల్యాలపై నాయకులను ప్రజాక్షేత్రంలో ఎండగడుదామని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో అందరం కష్టపడి పనిచేద్దామని, హుజూరాబాద్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇల్లంతకుంట మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలు నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడువకముందే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని అన్నారు. ప్రజల్లో బీఆర్‌ఎస్‌కు ఆదరణ పూర్తిస్థాయిలో ఉందని ఆయన అన్నారు. తెలంగాణకు కేసీఆర్ అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారని, మరోసారి ఆయన సీఎం కావాలని ముక్త కంఠంతో కోరుకుంటున్నారని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల్లో పనిచేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను నిలదీస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై కేసులు పెడుతున్నారని, అక్రమంగా అరెస్ట్ చేస్తే నియోజకవర్గం మొత్తం నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. మార్చి 10 వరకు అన్ని గ్రామాల్లో వివిధ కమిటీలు వేయాలని నాయకులకు సూచించారు. తనకు అండగా నిలబడిని అందరినీ గెలిపించుకునే బాధ్యత తనదేనని అన్నారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞత తెలిపేందుకు ఏప్రిల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామస్వామి, సీనియర్ నాయకులు చుక్కా రంజిత్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొమురెల్లి, ఇల్లంతకుంట మండల నాయకులు పాల్గొన్నారు.


ఎండిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత

## పంటలు ఎండుతున్నా పట్టదా..?

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, మార్చి5: ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు సాగు నీరందక రైతులు అల్లాడిపోతున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి పట్టదా..? మరీ ఇంత దుర్మార్గమా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సారంగాపూర్ మండలం పోతారం శివారులోని నాయకపు గూడెంలో బుధవారం ఆమె పర్యటించారు. స్థానిక రైతులతో కలిసి ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పుష్కలమైన జలాలతో రైతులు బంగారు పంటలు పండించారని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో నరకం చూస్తున్నారని, పొలాలకు సాగునీరందక ఆగమైపోతున్నారని, ఇక్కడ ఎండిన పంటలను చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన చెందారు. పోతారంలో హన్మంతరావు కుంటలో నీరులేక ఈ సీజన్‌లో దాదాపు 60 ఎకరాలు బీడు పెట్టుకునే పరిస్థితి రావడం ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమని మండిపడ్డారు. రేచపల్లి నుంచి కెనాల్ ద్వారా ఎక్కువ ఫ్లోతో నీటిని విడుదల చేస్తే హన్మంతరావు కుంటలోకి నీళ్లు వస్తాయని, కానీ, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడితే రెండ్రోజుల కిందనే నీటిని వదిలి పెట్టామని చెబుతున్నారని, కానీ ఇక్కడికైతే నీళ్లు రాలేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు స్పందించి, గ్రామాల్లో పర్యటించి రైతుల బాధలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ పశువులను మేపుతున్న రైతుల వద్దకు వెళ్లారు. వారితో కలిసి పొలంలోనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సాగుకు సమృద్ధిగా నీరందించేందుకు ఎమ్మెల్సీ కవిత సహకారంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను ఆధునీకరించి, 90శాతం పనులు పూర్తిచేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. ప్రాజెక్టుకు ఒక్క షటర్ పెట్టి, లిఫ్ట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతానికి పుష్కలంగా నీరందుతుందని చెప్పారు. కానీ ఒక్క షటర్ కూడా ఏర్పాటు చేయించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్నదని ఎద్దేవా చేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, విండో మాజీ చైర్మన్ సాగి సత్యం రావు, మాజీ సర్పంచులు బైరి మల్లేష్ యాదవ్, గుర్రం స్వామి, భుక్య అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్ ఉన్నారు.




## మొదటి రోజు ప్రశాంతం


నగరంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, మార్చి 5 : ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1 నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలో 18,108 మంది, జగిత్యాలలో 7,280 మంది, పెద్దపల్లిలో 5,154 మంది, సిరిసిల్లలో 3,932 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికారులు సౌకర్యాలు కల్పించారు.

మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన పసుపు కుప్పలు



పచ్చబంగారం పసుపు చిన్నబోయింది. ఆరుగాలం నమ్మి పంట వేసిన పంటకు డిమాండ్ తగ్గింది. జగిత్యాల జిల్లాలో ఈ సీజన్‌లో 22వేల ఎకరాల్లో సేద్యం చేయగా, కనీస గిట్టుబాటు రేటులేక ఆగమైపోతున్నది. గతేడాది క్వింటాల్‌కు ₹16వేల నుంచి ₹18వేలు పలికిన ధర, ఈ సారి సగానికి పడిపోయింది. దీంతో రైతాంగం దిగాలు చెందుతున్నది. పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్టు కేంద్రం ప్రకటించినా భరోసా లేకపోవడంతో మండిపడుతున్నది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నది.



- గతేడాదితో పోలిస్తే సగానికి పడిపోయిన ధర
- పసుపు బోర్డు వచ్చినా భరోసా కరువు
- ఆందోళనలో రైతులు
- కనీస మద్దతు ధర కోసం వేడుకోలు

## పసుపు రైతు దిగాలు

### చిన్నబోయిన పచ్చబంగారం

మెట్‌పల్లి, మార్చి5: మార్కెట్‌లో ప్రస్తుతం పసుపు ధర రైతులను నిరాశకు గురి చేస్తున్నది. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట ఉత్పత్తికి కనీస గిట్టుబాటు ధర లభించక దిగులు చెందుతున్నారు. జగిత్యాల జిల్లాలో ఈ సంవత్సరం 22 వేల ఎకరాల మేర విస్తీర్ణంలో పసుపు పంటను సేద్యం చేశారు. అందులో ప్రధానంగా మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్లలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం,మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో ఎక్కువగా పంటను పండిస్తారు. ఒక్కో సారి షేర్ మార్కెట్‌ను తలపించేలా పసుపు ధర పలుకుతుంది. ఒక స్థిరమైన ధర అనేది లేకపోవడంతో ఎప్పుడు పెరుగుతుందో.. మరెప్పుడు అమాంతం తగ్గుతుందో తెలియని పరిస్థితి ఉన్నది. ఓ ఏడాది నష్టపోయిన మరో ఏడాదిలోనైనా ధర వస్తుందనే ఆశతో పసుపు పంటను సంప్రదాయ పంటగా అనేక మంది రైతులు చేస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, పంట విత్తనం మొదలు కొని పంట దిగుబడి వరకు సేంద్రియ, రసాయనిక ఎరువులు, క్రిమీసంహారక మందులు, కల్టివేటర్, పంట కోత, తవ్వకం, బాయిల్డ్ చేసి మార్కెట్‌కు తరలించడం దాకా ఎకరానికి కనీసం ₹70 వేలు ఆపై వ్యయం అవుతున్నది. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి పసుపు దిగుబడి వస్తుండగా, రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయితే పసుపు మార్కెట్లలో రాష్ట్రంలోనే నిజామాబాద్ తర్వాత మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ రెండోది అని చెప్పొచ్చు. ఇక్కడికి మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ల పరిధిలోని రైతులతోపాటు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, భీంగల్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, నిర్మల్ జిల్లా ఖానాపూర్, లక్ష్మణచందా, మామడ మండలాల నుంచి రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొనివస్తారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధర పసుపు రైతులకు ఆందోళన కలిగిస్తున్నది. 'పసుపు బోర్డు వచ్చింది. ఇక తమకు మంచి రోజులు వచ్చాయని' భావించారు. కానీ, అందుకు భిన్నమైన పరిస్థితి ఎదురవుతున్నది. గతేడాది క్వింటాల్ పసుపుకు ₹16 వేలు నుంచి ₹18 వేలు ధర పలికితే ఈ సారి సగానికి పడిపోవడం పసుపు రైతులను నిరాశపరుస్తున్నది. ఈ క్రమంలోనే రైతులు, రైతు ఐక్య వేదిక నాయకులు పసుపునకు కనీస మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మార్కెట్ ఇంటర్వేన్షన్ స్కీం (ఎంఐఎస్)కింద క్వింటాల్‌కు ₹15 వేలు మద్దతు ధర ప్రకటించి ఏదైనా ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



**వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి**

ఎన్నికల ముందు పసుపు రైతులను ఆదుకుంటాం. కనీస మద్దతు ధర క్వింటాల్‌కు ₹15 వేలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో డిక్లరేషన్‌ను ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ డిక్లరేషన్‌ను అమలు చేయడం లేదు. మార్కెట్‌లో పలుకుతున్న పసుపు ధర రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పసుపు స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి.

**- యాళ్ల తిరుపతిరెడ్డి, రైతు (మేడిపల్లి పడమర)**



**బోర్డుతో భరోసా లేదు**

పసుపు బోర్డు వచ్చిందని సంబురపడ్డాం కానీ, పసుపు పండించిన రైతుకు మాత్రం భరోసా ఇవ్వడం లేదు. బోర్డు ప్రారంభించిన్రు అయినా నిధులు మాత్రం కేటాయించకపోవడం దారుణం. మద్దతు ధర కోసం బోర్డు వాళ్లను అడిగితే రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదంటున్రు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని మార్కెట్ ఇంటర్వేషన్ స్కీం కింద మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించి పసుపు రైతులను ఆదుకోవాలి.

**- కాటిపల్లి నాగేశ్వర్‌రెడ్డి, రైతు (పెద్దాపూర్)**

**నాఫెడ్ చేత కొనుగోలు చేయించాలి**



పసుపు పంటకు ఈ సారి పసుపు ధర ఆశాజనకంగా లేదు. మార్కెట్‌లో వ్యాపారుల మధ్య పోటీ తత్వం లేకపోవడం, స్వల్ప సంఖ్యలో వ్యాపారులు ఆన్‌లైన్ వేలం పాల్గొనడం వల్ల బలమైన పోటీ ఏర్పడక పసుపు ధరలు తగ్గుతున్నాయి. గతేడాది క్వింటాల్‌కు ₹16 వేలు నుంచి ₹18 వేలు పలుకగా ఆ సారి సగానికి పడిపోయింది. ప్రస్తుతం పలుకుతున్న ధరలతో పంట సాగుకు పెట్టిన వ్యయం కూడా సమం కాలేక అప్పుల పాలుకావాల్సిన దుస్థితి రైతుకు ఏర్పడుతున్నది. క్వింటాల్‌కు కనీసం ₹15 వేలు మద్దతు ప్రకటించి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నాఫెడ్‌తో, మరే ఏజెన్సీతోనైనా నేరుగా రైతుల నుంచి పసుపు కొనుగోలు చేయించాలి.

**- మారు మురళీధర్‌రెడ్డి, రైతు ఐక్యవేదిక నాయకుడు (వెల్లుల్ల)**

## పెద్దగుట్ట వద్ద పురాతన నాణేలు

పురావస్తు శాఖకు పంపిన అధికారులు


దొరికిన పురాతన నాణేలు

పెగడపల్లి, మార్చి 5: బతికపల్లి సమీపంలో పెద్దగుట్ట వద్ద ఉపాధి పనులు చేస్తుండగా పురాతన కాలం నాటి నాణేలు బయటపడ్డాయి. బుధవారం గ్రామ సమీపంలోని పెద్దగుట్ట వద్ద సుమారు 60 మంది ఉపాధి కూలీలు కాంటూరు కందకాలు తవ్వుతున్నారు. కూలీలు దావుల జమున, మల్యాలకు ముందుగా రెండు నాణేలు కనిపించాయి. వారు మరి కొంచెం తవ్వడంతో మొత్తం 20 నాణేలు దొరికాయి. సమాచారం మేరకు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ రవికిరణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జమున అక్కడికి చేరుకున్నారు. వెండిని పోలి ఉర్దూ భాష రాసి ఉన్న నాణేలను పరిశీలించారు. వాటిని పురావస్తుశాఖ అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలగొండ కృష్ణహరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అంజిరెడ్డి

- రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపు
- భావోద్వేగానికి గురై కంటతడి పెట్టిన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి
- హస్తానికి ఎదురు దెబ్బ.. సీఎం ప్రచారం చేసినా ఒనగూరని ప్రయోజనం


చిన్నమైల్ అంజిరెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 5: కరీంనగర్– ఆదిలాబాద్– నిజామాబాద్– మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో ఆయన గెలుపొందారు. రెండు రోజుల పాటు జరిగిన కౌంటింగ్ ప్రక్రియ ఆద్యంతం ఆసక్తి రేపింది. బీజేపీ–కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య 'నువ్వా నేనా' అన్నట్టుగా ఓట్లు రావడంతో చివరి వరకూ ఉత్కంఠ నెలకొంది. మండలి స్థానం పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోలయ్యాయి. అందులో 28,686 ఓట్లు చెల్లకుండా పోగా 2,23,343 చెల్లుబాటయ్యాయి. వీటిలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 75,675, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 70,565, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 60,419 ఓట్లు వచ్చాయి. నిబంధనల ప్రకారం మొదటి ప్రాధాన్యతలోనే గెలుపు కోసం అవసరమైన కోటా 1,11,672 ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలి. మొదటి ప్రాధాన్యతలో ఏ అభ్యర్థి కూడా సంపూర్ణ మెజార్టీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు చేపట్టారు. మొత్తం 56 మంది పోటీచేయగా, రెండో ప్రాధాన్యత క్రమంలో లెక్కించేందుకు గాను 54 మందిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. చివరకు బీజేపీ అభ్యర్థికే అత్యధిక ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాకపోయినా 5వేల పై చిలుకు ఓట్ల ఆధిక్యం ఉండడంతో మూడో ప్రాధాన్యతకు వెళ్లకుండా అంజిరెడ్డి గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. కాగా, రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపుపై ఎంతో ధీమాతో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, ఊహించిన దానికి భిన్నంగా ఫలితం వెలువడడంతో భావోద్వేగానికి గురయ్యారు. కంటనీరు పెడుతూ తన అనుచరులతో కలిసి లెక్కింపు కేంద్రం నుంచి వెళ్లిపోయారు. కన్నీళ్లు పెట్టిన నరేందర్‌రెడ్డిని తన అభిమానులు సముదాయించి దగ్గరుండి బయటకు తీసుకెళ్లారు.

### ముఖ్యమంత్రి ప్రచారం చేసినా ఓటమే


కంటతడి పెడుతున్న నరేందర్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం చేశారు. మూడు జిల్లాల్లో బహిరంగ సభలు ఏర్పాటుచేసి ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసిందంటూ చెప్పుకొచ్చారు. అన్ని వర్గాలను ఆదుకుందంటూ ఓట్లు పొందడం కోసం ఆయన ఏకరువు పెట్టారు. కానీ, ఆయన ప్రచార ప్రక్రియ ఫలించలేదు. కాంగ్రెస్‌కు అండగా పట్టభద్రులు నిలువలేదు. ముఖ్యమంత్రి ప్రచారం చేసినా పెద్దగా ప్రయోజనం లేకపోయిందని, అలాగే కాంగ్రెస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత వల్ల నరేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారన్న చర్చ ప్రస్తుతం పార్టీలో నడుస్తున్నది. అంతేకాదు, రేవంత్‌రెడ్డి ప్రభావం ప్రజల్లో పలుచ పడిందని చెప్పడానికి ఇదో నిదర్శనమన్న చర్చ సాగుతున్నది. నిజానికి గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వచ్చి ప్రచారం చేసిన దాఖలాలు లేవు. కానీ, రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారం చేశారు. అంతేకాదు, ఒక సామాజిక వర్గాన్ని ఒక తాటిపైకి తెచ్చి అభ్యర్థిని గెలిపించాలని ప్రయత్నించారు. కానీ, ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. దీంతో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత పెరుగుతుందని, ముఖ్యమంత్రి ప్రచారం చేసినా ఇక ముందు విజయాలు కష్టమే అన్న ప్రచారం ప్రస్తుతం జరుగుతున్నది.